RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 241 | పేజీలు : 08 | గురువారం | 10-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## ఫాంహౌస్‌లో కుట్రపై
# సమగ్ర విచారణ

**సీఎం రేవంత్‌రెడ్డి**




2

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

బీఆర్‌ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. సభను అడ్డుకోవాలని బీఆర్‌ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. మూడు రోజుల ఘటనలకు ఫాంహౌస్ సాక్షిగా కుట్ర జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీ ఘనటలపై విచారణకు ఆదేశించామని అన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని.. చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిని.. కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని అన్నారు.

**విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్..**

ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్‌ను నియమించామని వెల్లడించారు. ఈనెల 6వ తేదీన ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని ఆరోపించారు. 7వ తేదీన స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని అన్నారు. 8వ తేదీన శుద్ధి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు.. కుట్ర చేసిన అందరిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో గానీ.. సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని చెప్పారు. అసెంబ్లీ ఘనటలపై విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు.

**కేసీఆర్ కుట్ర పన్నారు..**

ప్రజా సమస్యలపై చర్చ కోసమే తాము అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 22ఏ భూములు సహా అన్ని అంశాలను చర్చించాలనుకున్నామని పేర్కొన్నారు. ఈ అంశాలపై చర్చ జరిగితే వారికి రాజకీయ సమాధి తప్పదని అసెంబ్లీ సమావేశాలపై కుట్ర చేశారని ఆగ్రహించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందురోజు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎర్రవల్లి ఫాంహౌస్‌కు పిలిపించుకుని కుట్ర పన్నారని ఆగ్రహించారు. అసెంబ్లీ సమావేశాలు జరగకుండా కేసీఆర్ కుట్ర పన్నారని ఆరోపించారు.

**ఉత్తరాఖండ్ ఘటనే.. తెలంగాణలో జరిగింది..**

'ఉత్తరాఖండ్‌లో గతంలో జరిగిన ఘటనను ఖండిస్తూ రాష్ట్రపతికి మేము ఫిర్యాదు చేశాం. దురదృష్టవశాత్తు అలాంటి ఘటనే మన తెలంగాణలో జరిగింది. కొంతమంది వచ్చి మన అసెంబ్లీ ఎదుట.. బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడి చేశారు. స్పీకర్‌తోపాటు వారి



2

## ప్రజా సమస్యలపై వేసిన
# సస్పెన్షన్ వేటు

- **ఇది బీఆర్‌ఎస్ సస్పెన్షన్ కాదు..ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు**
- **అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్**
- **బీఆర్‌ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్**
- **ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు**

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్

## 'ఒకరి చావు కోరడం సమర్థనీయం కాదు'..

**కేసీఆర్‌పై వ్యాఖ్యలకు ఎమ్మెల్యే వివరణ**

2



## స్పీకర్ అంటే ఎంతో
# గౌరవం ఉంది

- **తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డిని కూడా సస్పెండ్ చేశారు**
- **తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫైర్ సభలో లేని వారిని కూడా సస్పెండ్ చేశారంటూ తలసాని మండిపాటు**
- **22-ఏ వంటి అంశాలపై చర్చ జరగకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపాటు**
- **స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని వ్యాఖ్య**

2

## సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు..

**సీపీ సజ్జనార్‌కి ఎంపీ మల్లు రవి ఫిర్యాదు**

సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తీవ్ర

## చెడు జరగాలని కుటుంబ సభ్యులే
# కోరుకుంటున్నారు

- **కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు: మహేశ్ గౌడ్**
- **కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్**
- **కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి**
- **కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ**
- **సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు**
- **హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య**



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్

## ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు
# నష్టం లేదు

- **ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు**
- **ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్**
- **తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి**
- **ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు**



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా



## స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

- **అధికార దుర్వినియోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ శ్రేణులు నిలబడాలని పిలుపు**
- **సర్ ప్రక్రియలో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వెల్లడి**
- **స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా**

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఒక 'కురుక్షేత్ర సంగ్రామం' లాంటివని వైసీపీ అధినేత జగన్ అన్నారు. అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల



## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి

- **కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు**
- **ఆ ప్రాంతాన్ని బీఆర్‌ఎస్ నేతలు శుద్ధి చేశారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్**
- **దళితుల పట్ల వివక్షను బీఆర్‌ఎస్ మరోసారి నిరూపించుకుందని మండిపాటు**

## కేటీఆర్,హరీశ్‌రావు సహా
# సభ్యుల సస్పెన్షన్

- **అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌కు షాక్ కేటీఆర్,హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్**
- **ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్‌ఎస్ సభ్యుల ఆందోళన**
- **సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ**
- **బీఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు**
- **అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా**



## పోలవరాన్ని గోదాట్లో కలిపారు..

**మెగా డీఎస్సీకి అడ్డుపడ్డారు: సీఎం చంద్రబాబు ఫైర్**

- **గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర విభజన కన్నా ఎక్కువ నష్టం జరిగిందన్న చంద్రబాబు**
- **రాజకీయ కక్షతో పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారని ఆగ్రహం**
- **హింసను ప్రేరేపిస్తూ గొడ్డలి పార్టీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపణ**
- **మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వందల కేసులు వేశారని మండిపాటు**
- **ప్రజల మద్దతుతోనే పోలవరం, అమరావతి నిర్మాణం సాధ్యమవుతోందని ఉద్ఘాటన**



**హైదరాబాద్ పల్స్,డెస్క్**

కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంటే, 'గొడ్డలి పార్టీ' కుట్రలు పన్నుతోందని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలాంటివి

మొదటి పేజీ రువాయి

ప్రయోగం, అక్రమ కేసులను ఎదుర్కొని వైసీపీ కార్యకర్తలు గట్టిగా నిలబడాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఈరోజు నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పేరిట చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల వెనుక స్థానిక ఎన్నికలను తప్పించుకునే కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు.సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయంటే, ఎన్నికలు ఏ రీతిలో సజావుగా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నంత కాలం పారదర్శక ఎన్నికలు సాధ్యం కావని... నిత్యం ఏదో ఒక డ్రామా ఆడుతూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు.గతంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను తీసుకెళ్లిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు అదే 23 సీట్లకు పరిమితం చేసి గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. దౌర్జన్యాలు, అబద్ధాలు ఎల్లకాలం సాగవని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

### ప్రజా సమస్యలపై వేసిన

# సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ రువాయి

అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు."ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

### ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు

# నష్టం లేదు

మొదటి పేజీ రువాయి

శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు.ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు.ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు.గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

# ఫాంహౌస్‌లో కుట్రపై సమగ్ర విచారణ

మొదటి పేజీ రువాయి

తల్లిని అవమానించారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను సమాజమంతా ఖండించింది. ఏ ఫాంహౌస్‌లో కుట్రలు చేశారో.. అక్కడే నిరసన తెలపాలని దళితులు నిర్ణయించుకున్నారు. ఫామ్‌హౌస్‌లో పన్నిన కుట్రలకు వ్యతిరేకంగానే.. అక్కడ నిరసన తెలపడానికి వారు వెళ్లారు.. దాడుల కోసం కాదు. ప్రజాస్వామిక పద్ధతిలో డప్పు కొట్టి దండోరా వేయడం ద్వారా.. తమ మనసులోని భావాలను దళితులు వ్యక్తీకరించారు' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ అంటే ప్రజలకు ఓ నమ్మకం..

'కాంగ్రెస్ అంటే ప్రజలకు ఓ నమ్మకం, విశ్వాసం. గొప్ప లక్ష్యంతో కాంగ్రెస్ ఆవిర్భవించింది. దేశం కోసం ఈ పార్టీ ఎన్నో త్యాగాలు చేసింది. అణచివేత, వివక్షకు లోనైన జాతుల అభివృద్ధి కోసం.. రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సంక్షోభాలు ఎదుర్కొన్నప్పుడు.. మన దేశాన్ని నిలబెట్టింది కాంగ్రెస్ మాత్రమే. బ్రిటిష్ వారి దోపిడీ, దుర్మార్గాలపై పోరాడింది ఈ పార్టీనే. మన రాజ్యాంగం భారత్‌ను ప్రపంచ దేశాల ఎదుట.. గర్వంగా నిలబడేలా చేసింది' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# పోలవరాని గోదాట్లో కలిపారు..

మొదటి పేజీ రువాయి

కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గం మాచవరంలో 'మీ భూమి-మీ హక్కు' సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర విభజన నష్టాలు, గత ప్రభుత్వ తీరు, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా ప్రసంగించారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "రాజకీయ కక్షతో పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదాట్లో కలిపేశారు. కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉంటే 2021కే ప్రాజెక్టు పూర్తయ్యేది. ఇప్పుడు కరవు పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టు రాష్ట్రాన్ని ఆదుకునేది. గత పాలనలో బయటకు రావాలంటే, మాట్లాడాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారు. కల్తీ మద్యం కారణంగా సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు" అని ఆయన ఆరోపించారు.వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు విరుచుకుపడ్డారు. "ప్రజల సమస్యలపై చర్చించమని అసెంబ్లీకి రమ్మంటే వచ్చేది లేదని మొండికేస్తున్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు, ఎక్కడికి వెళ్లినా హింసే. 'రప్పా రప్పా' అంటూ రౌడీయిజం చేస్తారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలి ఇచ్చి హింసను ప్రేరేపిస్తారు. సామాజిక మాధ్యమాల్లో మా కుటుంబ సభ్యులపై అసభ్యంగా రాతలు రాయిస్తారు. ఒక రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు.శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే వ్యవహరిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. "గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించాను. అలిపిరిలో నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా ప్రజల కోసమే పనిచేస్తున్నాను. ముఠా కక్షల విషయంలో మాట వినని నా పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయించిన చరిత్ర నాది. సీఎంగా నేను సమర్థవంతంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది" అని అన్నారు.కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని, దీనివల్లే రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చంద్రబాబు తెలిపారు. పోలవరం, అమరావతి నిర్మాణ పనులను తిరిగి చేపట్టగలిగామన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును తానే ప్రారంభించానని, ఆ నీటితో ప్రజల ముఖాల్లో ఆనందం చూసినప్పుడు తనకు ఎంతో సంతృప్తి కలిగిందన్నారు.మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రయత్నిస్తే, 350 కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారని, సరైన ఆధారాలు లేవని కోర్టు కూడా వారిని మందలించిందని గుర్తుచేశారు. గొడ్డలి పార్టీ ఎన్ని కుట్రలు చేసినా బెదిరేది లేదని, ప్రజల కోసమే నిత్యం ఆలోచిస్తానని ఆయన స్పష్టం చేశారు. రూ. 240 కోట్ల వ్యయంతో కోనసీమలో గ్రిడ్ ఆధునీకరణ చేపట్టి 3 ఫేస్ కరెంటు అందిస్తున్నామని, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ పాలనను మెరుగుపరుస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

### కేటీఆర్,హరీశ్‌రావు సహా

# సభ్యుల సస్పెన్షన్

మొదటి పేజీ రువాయి

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది.సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు.దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది.దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

# 'ఒకరి చావు కోరడం సమర్థనీయం కాదు'..

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, సెప్టెంబర్ 9: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరణ ఇచ్చారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఒకరి చావు కోరడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ముఖ్యమంత్రిని, దళిత అసెంబ్లీ స్పీకర్‌ను, మహిళా మంత్రులను అసభ్యకరంగా కులాల పేరుతో దూషిస్తూ వ్యక్తిగతంగా బూతులు తిడుతున్నారని మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని.. స్పీకర్‌ను అసభ్యపదజాలంతో దూషించారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కడుపు మండి కేసీఆర్ వెంటనే అసెంబ్లీకి రావాలని, సమస్యలపై చర్చించాలని కోరినట్లు తెలిపారు.తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని.. కేసీఆర్ కుటుంబ ఒక్కరిదే కాదని ఎమ్మెల్యే అన్నారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎంపై, వారి కుటుంబ సభ్యులపై బూతులు తిడుతున్నారని ఫైర్ అయ్యారు. 'మీ ఇంట్లో కూడా ఆడబిడ్డలు ఉన్నారు కదా. వారి ముందు ఇలా మాట్లాడుతారా. టీవీలలో మీ బూతులు వినలేక మహిళలు చెవులు మూసుకుంటున్నారు. మీ కుటుంబ సభ్యులు కూడా ఆ మాటలు వినలేక తలదించుకుంటున్నారు' అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తలిపారు. అలాగే, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ కుమారుడు రాహుల్ గాంధీపై 'ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ' అని మూడు రోజుల క్రితం కరీంనగర్‌లో కేటీఆర్ మాట్లాడిన వీడియోలను ఈ సందర్భంగా మీడియాకు ఎమ్మెల్యే విడుదల చేశారు.

### స్పీకర్ అంటే ఎంతో

# గౌరవం ఉంది

మొదటి పేజీ రువాయి

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ వేటుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని తీవ్రంగా అభాసుపాలు చేస్తోందని, ప్రజా సమస్యలు, కీలకమైన జీవో 97, 22-ఏ వంటి అంశాలపై చర్చ జరగకుండా తప్పించుకునేందుకే విపక్ష సభ్యులను సస్పెండ్ చేస్తోందని ఆరోపించారు.సభకు రాకుండా తిరుమల పర్యటనలో ఉన్న మల్లారెడ్డితో పాటు, సభలో లేని పద్మారావు గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, కేటీఆర్, గంగుల కమలాకర్ పేర్లను కూడా సస్పెన్షన్ జాబితాలో చేర్చడం శాసనసభా చరిత్రలోనే హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి చదివిన జాబితా ఒకటైతే, స్పీకర్ ప్రకటించిన పేర్లు మరో విధంగా ఉన్నాయని తప్పుబట్టారు.తెలంగాణ సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ చావును కోరుకుంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఎలాంటి సస్పెన్షన్ వేటు వేయకుండా సభలోనే కూర్చోబెట్టుకున్నారని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే బీఆర్ఎస్‌కు ఎంతో గౌరవం ఉందని, ఆయనపై గౌరవంతోనే నాడు స్పీకర్ ఎన్నికలో అభ్యర్థిని కూడా నిలబెట్టలేదని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ నాయకులు నిత్యం 'దళిత స్పీకర్' అని వర్గీకరిస్తూ ఆయన ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఏఐ ఫేక్ ఫొటోలతో బీఆర్ఎస్ నేతలను నెగెటివ్‌గా వైరల్ చేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు వెళుతుంటే తమ నేతలను అరెస్ట్ చేయడం, జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడటం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని తలసాని ధ్వజమెత్తారు.

### చెడు జరగాలని కుటుంబ సభ్యులే

# కోరుకుంటున్నారు

మొదటి పేజీ రువాయి

గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు.సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు.కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు.కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి

మొదటి పేజీ రువాయి

తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు.దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు.మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది

# సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు..

మొదటి పేజీ రువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 356, 352 కింద కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అలాగే, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌కి ఎంపీ ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌పై.. కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.కేటీఆర్ వ్యాఖ్యలు పరువు నష్టం, అనుచితంగా ఉన్నాయని ఎంపీ ఆరోపించారు. కేటీఆర్‌పై పలు సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేయాలని సీపీ సజ్జనార్‌కి విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా, మీడియా ఆధారాలను భద్రపరచాలని ఎంపీ మల్లు రవి కోరారు.

**అసెంబ్లీ మీద బీఆర్ఎస్ దాడి చేసింది: ఎంపీ మల్లు రవి**

బీఆర్ఎస్ సభ్యులు వ్యక్తి ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నారని ఎంపీ మల్లు రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా మాజీమంత్రి హరీశ్‌రావు ప్రవర్తన ఉందని ధ్వజమెత్తారు. ఫాంహౌస్ కేంద్రంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కుట్ర చేస్తున్నారని ఆగ్రహించారు. కావాలనే హరీశ్‌రావు రాష్ట్రపతి పాలన కోరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు ఒకరు స్పీకర్‌ను తిడతారని, మరోకరెమో సీఎంను తిడతారని దుయ్యబట్టారు. ఇంకొకరు పోలీసులతో అసభ్యంగా వ్యవహరిస్తారని మండిపడ్డారు. మహిళా కానిస్టేబుళ్లతో బీఆర్ఎస్ సభ్యులు అసభ్యంగా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీద బీఆర్ఎస్ దాడి చేసిందని అన్నారు. ప్రశ్నించడం వేరు, తిట్టడం వేరని చెప్పారు. అందుకే మాజీ మంత్రి కేటీఆర్‌పై బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో తాను ఫిర్యాదు చేశానని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.

# సామ్రాజ్యవాదాన్ని చీల్చి చెండాడిన కామ్రేడ్ మావో

**చైనా పీడిత ప్రజల విముక్తి నిర్మాత, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించి, జన చైనా గా వెలుగును పంచిన మార్క్సిస్టు మహోన్నత మేదావి..మావో**

**ఆర్.జనార్ధన్, సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజా విముక్తి ప్రదాత, జన చైనా నిర్మాత, జపాన్ సామ్రాజ్యవాదాన్ని చీల్చి చెండాడి, చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసిన మార్క్సిస్టు మేధావి కామ్రేడ్ మావో అని, సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. సెప్టెంబర్ 9 కామ్రేడ్ మావో 50 వ వర్ధంతిని యాదగిరిగుట్ట మండలం యాసోజిగూడెం లో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం



జరిగిన సభ లో జనార్ధన్ మాట్లాడుతూ... సామ్రాజ్యవాద దోపిడీ, పీడన, రైతాంగ, ప్రజా విముక్తి కోసం సుధీర్ఘ పోరాటాన్ని అభివృద్ధి చేసి, రెడ్ ఆర్మీ (ఎర్ర సైన్యం) రిక్రూట్మెంట్ ను గ్రామీణ,పట్టణ ప్రాంతాల ప్రజలతో లక్షల సంఖ్యలో నిర్మించి,ముందుగా గ్రామాలను ఆ తరువాత పట్టణాలను విముక్తి చేయాలనే దృఢమైన సంకల్పంతో పోరాడిన చైనా ప్రజలు అనేక త్యాగాలు, వీర మరణాలు పొందినప్పటికీ కామ్రేడ్ మావో నాయకత్వంలో జన చైనాను సాధించి, సాంస్కృతిక విప్లవాన్ని, అంతిమంగా నూతన ప్రజాస్వామిక విప్లవంను విజయవంతంతో చైనా అనేక దోపిడీ, పీడన నుండి ముఖ్యంగా జపాన్ సామ్రాజ్యవాద దోపిడీ నుండి విముక్తి అయిందని అందుకు కామ్రేడ్ మావో చైనా తో పాటు ప్రపంచ పీడిత ప్రజలకు ఆదర్శ కమ్యూనిస్టు యోధునిగా నిలిచాడని అన్నారు. కామ్రేడ్ మావో పోరాట స్పూర్తితో భారత విప్లవోద్యమాన్ని నిర్మించాలని,భారత బడా కార్పోరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తున్న బీజేపీ మోడీ ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒకరికంటే ఒకరు ఘనులు అనే విధంగా ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీ లు వాదులాడుతూ, ప్రజా సమస్యలను ఎజెండా మీదికి రాకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు కళ్ళ ముందు ఉన్నప్పటికీ వాటి అమలు కోసం ప్రభుత్వం గానీ ప్రతిపక్షం కానీ ఏమీ మాట్లాడకుండా నిర్లక్ష్యంగా సమావేశాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్యే న్యూ డెమోక్రసీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు ఆర్.సీత, పంజాల మురళి, గూడెం నరేష్, భీమగాని రాజు, భీమగాని అశోక్, భూషె శ్రీశైలం, కొండే బీరుమల్లయ్య, బుడిగే లక్ష్మయ్య, బుడిగి ఐలయ్య, ఆసర్ల స్వామి, గూడెం నర్సింహులు, ఎం.డీ.మైబూబ్ అలీ, గీస భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఈ నెల 8వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవానికి ఓయూ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన భారత్ బయోటెక్ ఫౌండర్ & చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్.కృష్ణ.ఎం.ఎల్లా మరియు ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. కుమార్ మొలుగరం చేతుల మీదుగా కొమ్ము శేఖర్ మాదిగ పీహెచ్డీ డాక్టరేట్ పట్టా అందుకోవడం జరిగింది.ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారధి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్: ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు గాను కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ పట్టా ప్రధానం చేసింది.సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మార్గనిర్దేశకత్వంలో నడుస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) లో కీలక నాయకుడిగా ఎదిగిన కొమ్ము శేఖర్ ఓయూ అధ్యక్షుడిగా,



పలు జిల్లాలకు ఇంచార్జీగా తన సేవలను అందిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు.సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం యర్కారం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించిన తల్లిదండ్రులు కొమ్ము సరోజ–అంజయ్య దంపతులకు జన్మించిన శేఖర్ చిన్న వయసులోనే విద్యపట్ల ఆసక్తి పెంచుకొని, ఐదవ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆపై ఎల్.బి.నగర్లో పదో తరగతి వరకు, ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి తక్కువ వనరులతోనే ఉన్నత విద్య వైపు అడుగులు వేశారు.నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న కాలంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడగా, విద్యార్థి నాయకుడిగా పోరాటాలలో ముందువరుసలో నిలబడి తన కృషితో అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసిన శేఖర్ ఒకవైపు సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే, మరోవైపు ఉన్నతవిద్యలో ప్రగతిని ఆపకుండా పీహెచ్డీ ప్రవేశం పొంది పరిశోధనలో ప్రతిభ చాటారు.డాక్టరేట్ డిగ్రీ అందుకున్న సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కి అదేవిధంగా పరిశోధన పూర్తిచేయడానికి ఎంతో చొరవ తీసుకొని సహకరించిన తన గురువర్యులు ప్రొఫెసర్ వై. పార్థసారథి తో పాటు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని అధ్యాపకులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు.చిన్నతనంలో కూలీ పనులు చేస్తూ మరోవైపు సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం జరిగిన దండోరా ఉద్యమంలో నిబద్ధతతో పనిచేస్తూనే, విద్యను ఆయుధంగా మార్చుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకున్న కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకవర్గం, విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

# బీర్ల ఐలయ్య అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణ చెప్పాలి

**బీర్ల ఐలయ్య అహంకార పూరిత వ్యాఖ్యలు మానుకోవాలి**

**దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'దళితబంధు' పథకాన్ని అందించిన కేసీఆర్ పై చౌకబారు వ్యాఖ్యలా?**

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మాజీ సీఎం కేసీఆర్ పై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అహంకార పూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రాజపేట మండల బీఆర్ఎస్ నాయకులు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ముఖ్యమంత్రి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పై చేసిన అహంకార పూరిత, అత్యంత దిగజారుడు వ్యాఖ్యలను భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. అని అన్నారు. దళితులకు కేసీఆర్ మోసం చేశారంటూ పచ్చి అబద్దాలు ప్రచారం చేయడమే కాకుండా, ఎర్రవెల్లి ఫామ్హౌస్ ముందు కేసీఆర్ ని 'చావడప్పు కొట్టాలి' అంటూ ఒక బాధ్యతాయుతమైన శాసనసభ్యుడి హోదాలో ఉండి భౌతిక దాడులను ప్రోత్సహించేలా మాట్లాడటం ఆయన సంస్కారహీనతకు నిదర్శనం. తెలంగాణ ఉద్యమ నేతగా, పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసి, దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'దళితబంధు' లాంటి చారిత్రాత్మక పథకాన్ని అందించిన కేసీఆర్ పై ఇటువంటి హీనాత్మక పదజాలాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే విఘాతం.. బేషరతుగా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కేసీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే, బేషరతుగా వెనక్కి తీసుకోవాలి.

**అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలి:** అసెంబ్లీ వేదికగా కేసీఆర్ పై చేసిన వ్యాఖ్యలకు గాను, తిరిగి అసెంబ్లీ సాక్షిగానే కేసీఆర్ కి మరియు తెలంగాణ ప్రజలకు సభలోనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి.చట్టపరమైన చర్యలు తప్పవు: ఒకవేళ తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి, క్షమాపణ చెప్పకపోతే ఆయనపై చట్టపరమైన కేసులు నమోదు



చేసి, న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు ప్రజాసమస్యలపై చర్చించాల్సిన పవిత్రమైన శాసనసభను చౌకబారు రాజకీయాలకు, వ్యక్తిగత దూషణలకు నిలయంగా మార్చడం సరికాదు. కాంగ్రెస్ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ పై ఇటువంటి విష ప్రచారం చేస్తున్నారని, ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. రాజపేట ఎస్ఐ ఎండి. తక్కియుద్దీన్ కి వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, ఎడ్ల బాలలక్ష్మి, సందిల భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, మర్ల నాగరాజు, గుర్రం నర్సిములు, ఎడ్ల నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు

# ఆశా కార్యకర్తలకు రూ.18 వేల స్థిర వేతనం ఇవ్వాలి

**అసెంబ్లీలో ఆశా కార్యకర్తల సమస్యలను ప్రస్తావించాలి.**

**ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, నారాయణఖేడ్, సెప్టెంబర్ 09:** ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నారాయణఖేడ్, సిర్గాపూర్ తదితర మండలాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్లో చేపట్టిన కార్యక్రమంలో పోలీసులు అరెస్టులు చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న కార్మికులపై నిర్బంధ చర్యలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. గతంలో ఆశా కార్యకర్తలు సమ్మె చేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.18 వేల కనీస వేతనం అందిస్తామని, పని ఒత్తిడి తగ్గిస్తామని, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ళు పూర్తవుతున్నా హామీలు అమలు కాలేదని అన్నారు.ప్రభుత్వాలు మారుతున్నా ఆశా కార్యకర్తల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని రమేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేలు ఆశా కార్యకర్తల సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ఆశా




కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం ఇప్పటికైనా పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివరాజ్, ఆశా యూనియన్ అధ్యక్షురాలు స్వరూప, కార్యదర్శి వజ్రమణి, ఇన్నమ్మ, నర్సమ్మ, విజయలక్ష్మి, రుక్మిణి, జ్యోతి, అనురాధ, శారద, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ కోలా కిషన్ 22వ వర్ధంతిని నిర్వహించిన పార్టీ శ్రేణులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో కామ్రేడ్ కోలా కిషన్ 22 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థూపాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ... కామ్రేడ్ కోలా కిషన్ ఈ ప్రాంత నది జలాల కోసం, గంధమల్ల రిజర్వాయర్ కోసం ఎంతగానో కృషి చేసిన నాయకుడని వారు కొనియాడారు. ఆలేరు నియోజకవర్గ ప్రాంతంలో రైతులు పడే బాధలను చూసి ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కారం చూపిన గొప్ప నాయకుడు కీర్తిశేషులు కామ్రేడ్ కోల కిషన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోస్నబోయిన రవి, కోల దయానంద్, సుకేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.




# జాగృతి కళాశాలలో ఘనంగా కాళోజి జయంతి వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి పట్టణంలోని జాగృతి డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపల్ సింగనబోయిన మల్లేశం ఆధ్వర్యంలో ప్రముఖ ప్రజాకవి, స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడుతూ.. "నా గొడవే నా కవిత" అన్నాయాన్ని ఎదిరించడమే నిజమైన జీవితం ప్రజల గొంతుకే నా గొంతుక పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అనే నినాదంతో విద్యార్థులు ఇలాంటి వ్యక్తులను స్మరించుకుంటూ , ఆదర్శంగా తీసుకుంటూ భవిష్యత్తులో ముందుకెళ్లాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేష్, ఇస్తారి, సుధా కిషోరీ మరియు అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రూ.55 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

**కంటోన్మెంట్ బోర్డు నిధులతో వార్డు-6లో అభివృద్ధి పనులు**

**భూమిపూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, సికింద్రాబాద్, సెప్టెంబర్ 09:** కంటోన్మెంట్ బోర్డు నిధులు సుమారు రూ.55 లక్షలతో వార్డు–6 పరిధిలోని ఎస్బీఐ కాలనీ, జయనగర్, కుమ్మరిగుట్ట ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ పాల్గొని రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.చాలాకాలంగా రోడ్ల నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న తమ ప్రాంతంలో పనులు ప్రారంభం కావడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో కాలనీ వాసులు నర్సింగ్రావు, రవీందర్ కారంపురి, శ్రావంతి పెదపూడి, వేణు పెదపూడి, రూప, శ్రీనాథ్, అంజనా పూనియా, పవన్కుమార్ పూనియా, సునీత, అర్చన, వెంకటేష్, దేవేందర్, విజయ్వీర్సింగ్, మల్లయ్య, పాండురంగ్ శర్మ, పవన్, నిరంజన్, సాగర్ భోస్లే, దీపక్, సాయినాథ్, సదానంద్ రెడ్డి, శ్రవణ్కుమార్, రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కొంపల్లిలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

**నిమజ్జన మార్గాల్లో రహదారుల మరమ్మతులు, విద్యుత్ భద్రతకు చర్యలు**

**భక్తులకు, వాహనాలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, కొంపల్లి, సెప్టెంబర్ 09:** వినాయక విగ్రహాల నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కొంపల్లి డివిజన్‌లో చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్, కొంపల్లి సర్కిల్ కన్వీనర్ పెద్దబుద్ధుల సతీష్ సాగర్, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి తదితరులు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కొంపల్లి ఊర చెరువులో నీరు అందుబాటులో లేని నేపథ్యంలో సమితి సూచనల మేరకు చేపడుతున్న చిన్న నీటి గుంత నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే రహదారి మరమ్మతులను పరిశీలించారు. దూలపల్లి తుమ్మర చెరువులో నిమజ్జనానికి వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తలెత్తే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ.. నిమజ్జనానికి వచ్చే వాహనాలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రహదారుల మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినట్లు తెలిపారు. నిమజ్జన మార్గాల్లో చెట్ల కొమ్మలను తొలగించడం, నిమజ్జన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని ప్రమాదకర విద్యుత్ తీగలను సరిచేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులకు మండప నిర్వహణ, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మధు, శ్యామ్ కిరణ్, అశ్విన్, లక్ష్మణ్, నరసింహ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.






## టీనేజర్లపై డిజిటల్ దెబ్బ..తగ్గుతున్న చదివే శక్తి..

# పీసా-2025 నివేదికలో షాకింగ్ విషయాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 09:**
డిజిటల్ పరికరాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో టీనేజర్ల పఠనా సామర్థ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, అంతర్జాలం ద్వారా సమాచారం వేగంగా అందుబాటులోకి వస్తున్నప్పటికీ.. ఒక అంశాన్ని లోతుగా చదివి అర్థం చేసుకోవడం, సమాచారాన్ని విశ్లేషించడం, నిజానిజాలను గుర్తించడం వంటి నైపుణ్యాలు తగ్గుతున్నాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. 15 ఏళ్ల విద్యార్థుల చదువు, గణితం, విజ్ఞాన శాస్త్ర సామర్థ్యాలను అంచనా వేసే అంతర్జాతీయ విద్యా అధ్యయనంగా పీసా గుర్తింపు పొందింది. 2025 అధ్యయనానికి సంబంధించి ప్రచారంలో ఉన్న వివరాల ప్రకారం, గత దశాబ్దంలో విద్యార్థుల పఠనా సామర్థ్యంలో గణనీయమైన తగ్గుదల నమోదైనట్లు పేర్కొంటున్నారు.

**28 పాయింట్ల తగ్గుదల**

ప్రచారంలో ఉన్న గణాంకాల ప్రకారం 2015లో సగటు పఠనా స్కోరు 489 పాయింట్లు ఉండగా, 2025 నాటికి అది 461 పాయింట్లకు తగ్గినట్లు పేర్కొన్నారు. అంటే 28 పాయింట్ల తగ్గుదల నమోదైనట్లు నివేదికను ఉటంకిస్తూ కథనాలు వెలువడ్డాయి. అదేవిధంగా 2018 నుంచి 2025 మధ్య పఠనా స్కోరులో నమోదైన తగ్గుదల విద్యార్థుల విద్యా పురోగతిపై ప్రభావం చూపే స్థాయిలో ఉందని విశ్లేషణలు చెబుతున్నాయి. కనీస స్థాయి పఠనా నైపుణ్యాన్ని అందుకోలేని విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థుల వాటా తగ్గినట్లు పేర్కొంటున్నారు.



**సామాజిక మాధ్యమాల ప్రభావం**

విద్యార్థుల్లో తెర సమయం పెరగడం, సామాజిక మాధ్యమాల వినియోగం అధికం కావడం వల్ల ఏకాగ్రతపై ప్రభావం పడుతున్నట్లు విద్యారంగ నిపుణులు చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ నిడివి ఉన్న పుస్తకాలు, వ్యాసాలను ఓపికగా చదవడం కంటే చిన్నచిన్న సమాచార భాగాలను వేగంగా చదివే అలవాటు పెరుగుతున్నట్లు చెబుతున్నారు. 2018లో వేగంగా చదివి ముందుకు వెళ్లే విద్యార్థుల శాతం 6.6గా ఉండగా, 2025 నాటికి అది 11.4 శాతానికి పెరిగినట్లు ఈ కథనంలో పేర్కొన్న గణాంకాలు సూచిస్తున్నాయి.

**సమాచారాన్ని తెలుసుకోవడం మాత్రమే కాదు..**

అంతర్జాలంలో సమాచారం అందుబాటులో ఉండటం ఒకవైపు ప్రయోజనకరమైనప్పటికీ, అందులో ఏది వాస్తవం? ఏది తప్పుడు సమాచారం? అనే విషయాన్ని గుర్తించడం మరింత ముఖ్యమవుతోంది. సమాచారాన్ని పరిశీలించడం, ఆధారాలను ధ్రువీకరించడం, భిన్న అభిప్రాయాలను పోల్చి చూడడం వంటి విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా కాలం విద్యార్థుల చదువుపై ప్రభావం చూపినప్పటికీ, పఠనా సామర్థ్యంలో వచ్చిన మార్పులకు దానిని ఒక్కటే కారణంగా చూడలేమని విశ్లేషణలు పేర్కొంటున్నాయి. డిజిటల్ పరికరాల వినియోగం, చదివే అలవాట్లలో మార్పులు, ఏకాగ్రత తగ్గడం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# ప్రజా కవి కాళోజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**ప్రజా సమస్యలపై పోరాడుతూ సామాజిక చైతన్యం రగిలించిన కాళోజీ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, నారాయణఖేడ్, సెప్టెంబర్ 09:**
ప్రజా కవి కాళోజీ నారాయణరావు జీవితం, సాహిత్య స్ఫూర్తి, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్ అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకొని బుధవారం మానూర్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రతిభ శేఖర్ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనల ద్వారా ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులను సమాజం ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల్లో సామాజిక,



రాజకీయ చైతన్యం పెంపొందించడంలో ఆయన రచనలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. సామాన్యుల పక్షాన నిలబడి వారి గొంతుకగా కాళోజీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలు, ప్రజా సమస్యలపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. కాళోజీ ఆలోచనా విధానం, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జీవితం, సాహిత్యాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణు సాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్ కుమార్, ఆర్ఐ శంకర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మొయినుద్దీన్, రఘురాములు, నర్సింహారెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గౌరవరం గ్రామంలో మద్యపాన నిషేధానికి తీర్మానం

**గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, దుమ్ముగూడెం, సెప్టెంబర్ 09:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని గౌరవరం గ్రామపంచాయతీ పరిధిలో మద్యపాన నిషేధానికి గ్రామ పాలకవర్గం తీర్మానం చేసింది. గ్రామంలో మద్యపానం కారణంగా యువతపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్రామస్థులు సర్పంచ్ శ్యామల రవి వర్మ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు స్పందించిన సర్పంచ్.. గ్రామ ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రామసభలో సంపూర్ణ మద్యపాన నిషేధానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. అనంతరం భద్రాచలం ఎక్సైజ్ అధికారి కిష్టయ్యకు వినతిపత్రం అందజేసి గౌరవరం గ్రామంలో మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం అందించి ఎక్సైజ్ శాఖకు



సహకరించాలని గ్రామ ప్రజలను కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో మద్యపానాన్ని అరికట్టేందుకు గ్రామ ప్రజలు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభినందించారు.

# ఘనంగా శ్రీ దుర్గాభవాని ఆలయ 14వ వార్షికోత్సవం

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**గణపతి, చండీ హోమాలు.. 108 కలశాల పూజతో వైభవంగా వేడుకలు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఓల్డ్ బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 09:**
ఓల్డ్ బోయిన్‌పల్లి భవానినగర్‌లోని శ్రీ దుర్గాభవాని మాత ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వీరుపాక్షి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గణపతి హోమం, చండీ హోమం, 108 కలశాల పూజ, నాగాభరణాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శివాలయ గోపురంపై కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సామూహిక బోనాలు, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో భవానినగర్ కాలనీవాసులు, మహిళలు, వృద్ధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేసిన భక్తులు, కాలనీవాసులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలతో పాటు ఆలేరు నియోజకవర్గంలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు సంబంధించిన పలు సమస్యలపై ముఖ్యమంత్రితో బీర్ల ఐలయ్య చర్చించారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలు, ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని అంశాలపై సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు

**కాళోజీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి: సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, నర్సింహులపేట, సెప్టెంబర్ 09:**
ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కౌసల్యాదేవిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాళోజీ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన అందించిన సాహిత్య సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన కాళోజీ ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో ప్రజా చైతన్యం పెంపొందించేందుకు ఆయన సాహిత్యం, ఆలోచనా విధానం ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యులు కొత్త వెంకయ్య, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, ఉప్పుటూరి కేతమ్మ సుబ్బారావు, ఏర్పుల ప్రశాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి పురపాలక సంఘంలో కాళోజీ జయంతి వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ శ్రీమతి తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... తెలంగాణ భాష, సంస్కృతి కోసం కాళోజీ చేసిన కృషి మరువలేనిదని, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చర్లలో బొలెరో ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

### ముసిలేరు క్రాస్ రోడ్ వద్ద ప్రమాదం..

### మెరుగైన వైద్యం కోసం భద్రాచలానికి తరలింపు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, చర్ల, సెప్టెంబర్ 09:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ముసిలేరు క్రాస్ రోడ్ వద్ద బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కలివేరు గ్రామానికి చెందిన పూణెం నారాయణ, పార్వతి, సోందే జంపన్న ప్రమాదంలో గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను సత్యనారాయణపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు సందీప్ వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురినీ భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై నర్సిరెడ్డి, కేశవ్ సత్యనారాయణపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.





## ఘనంగా బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

### మహేందర్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 09 షాద్నగర్ ప్రతినిధి:**
జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన షాద్నగర్ బిజెపి ఇంచార్జ్ అందే బాబన్న, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కె. వెంకటేష్ గుప్తా, డాక్టర్ విజయకుమార్. బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి అన్నగారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహేందర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజలకు, పార్టీకి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో అందే బాబన్న, కె. వెంకటేష్ గుప్తా, డాక్టర్ విజయకుమార్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, రవి నాయక్, రమేష్, గణేష్ తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# బీఆర్ఎస్–బీజేపీ మధ్య ఫెవికాల్ బంధం

### పసుపు నీళ్లు పసుపు బియ్యం సంస్కృతి ఎక్కడిది..?

### కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించి, క్షమాపణ చెప్పాలి

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్, అసెంబ్లీ సమావేశంలో బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తూ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పదవికి, రాజ్యాంగబద్ధమైన పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ మధ్య ఫెవికాల్ బంధం కొనసాగుతోందని బీర్ల ఐలయ్య విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ఏ విధంగా వ్యవహరిస్తుందో, రాష్ట్రంలో బీఆర్ఎస్ కూడా అదే విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించారు. మంగళవారం రోజు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వేలాది మంది దళిత బిడ్డలు డప్పులు కొడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే, బీఆర్ఎస్ నాయకులు ఆ ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేసే సంస్కృతి ఎక్కడ ఉందో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించి, క్షమాపణ చెప్పాలని భావిస్తే.. అందుకు బదులుగా నిరసనలో దళితులు డప్పులు వాయిస్తూ ఫామ్‌హౌస్ వద్దకు వస్తే ఆ ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం ఏ సంస్కృతికి నిదర్శనమని బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ పసుపు బియ్యం కలిపి పంపిణీ చేయడం, అదే విదంగా దళితులు నిరసనకు వస్తే పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. బీజేపీ విధానాలను బీఆర్ఎస్ నాయకులు ఫాలో అవుతున్నారని విమర్శించారు. దళిత సోదరులు డప్పులు వాయిస్తూ ఫామ్‌హౌస్ వద్దకు వస్తే పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, తమ ఇళ్లలో పనిచేసే వారు, వాహనాలు నడిపేవారు, తమకు సేవలు అందించే వారిలో ఉన్న దళితులను కూడా ఇదే విధంగా చూస్తారా అని ప్రశ్నించారు. ప్రజలకు పట్టెడు అన్నం పెట్టే రైతులు, పొలం పనులు చేసే కూలీల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ కనీసం మరో 30--40 సంవత్సరాలు జీవించి, ప్రజాప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూడాలని బీర్ల ఐలయ్య అన్నారు. ప్రజలకు మంచి జరుగుతుంటే చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో త్యాగాలు చేసిన ప్రతి ఒక్కరినీ గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. దళిత బిడ్డలను అవమానించడం మాత్రమే కాకుండా తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలను అవమానించినట్లేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను బీర్ల ఐలయ్య తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబం చేసిన పాత్రను గుర్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ గుర్తు చేసుకోవాలని అన్నారు. త్యాగాల కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీపై మాట్లాడే ముందు ఆలోచించుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీ బయట జరిగిన ఘటనలో మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును తాము వీడియోల్లో చూశామని బీర్ల ఐలయ్య అన్నారు. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టి, వెనుక నుంచి తోసేయడం మహిళల పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. మహిళలను గౌరవించే సంస్కృతి బీఆర్ఎస్‌కు లేదని ఆరోపించారు. కేసీఆర్ ఇకనైనా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి అసెంబ్లీకి హాజరై, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగుల ముందు బట్టలు విప్పడం వంటి ఘటనలు అత్యంత సిగ్గుచేటని, అలాంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 22ఎ భూముల అంశంపై కూడా ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని బీర్ల ఐలయ్య తెలిపారు. దళితులు ఫామ్ హౌస్ దగ్గరకు వచ్చిన స్థలపై పసుపు నీళ్లు చల్లిన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని, ఆ చర్యకు కారణం ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు.



# ఘనంగా తెలంగాణ మాతృభాషా దినోత్సవం

### మాతృభాషపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా కార్యక్రమాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 09:**
పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం, వర్గల్‌లో తెలంగాణ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యత, అవసరంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు ఎం. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలను నేర్చుకోవడం మరింత సులభమవుతుందని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు తెలుగులో కవితలు, పద్యాలు, సామెతలను పఠించి తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యాలయ ప్రధానాచార్యుడు దాసి రాజేందర్ మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ మాతృభాషా దినోత్సవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మాతృభాషపై పట్టు సాధించి అనేక భాషలను నేర్చుకున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావును ఈ సందర్భంగా గుర్తు చేశారు. జవహర్ నవోదయ విద్యాలయాల లక్ష్యాల్లో భాగమైన త్రిభాషా సూత్రాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. నూతన విద్యా విధానం-2020కు అనుగుణంగా విద్యార్థులకు భాషల ప్రాధాన్యతను ఎప్పటికప్పుడు వివరిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు అధ్యాపకురాలు ఝాన్సీరాణి నేతృత్వంలో విద్యార్థినీ విద్యార్థులు కార్యక్రమాన్ని



నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు అధ్యాపకుడు ఎం. విజయ్‌కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### గర్మిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీమ్ అవగాహన సదస్సు

### రహదారి భద్రత, మహిళలు-బాలికల రక్షణపై విద్యార్థులకు అవగాహన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మంచిర్యాల, సెప్టెంబర్ 09:**
విద్యార్థులు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్మిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ విధులు, లక్ష్యాలు, మహిళలు, బాలికల భద్రత కోసం అందిస్తున్న సేవలపై విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద సందేశాలు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరించి, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రహదారి భద్రత విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థులు, మహిళలు ఎలాంటి ఆపద, వేధింపులు లేదా సమస్యను ఎదుర్కొన్నా వెంటనే 112కు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712659385ను సంప్రదించాలని తెలిపారు. ఈ నంబర్లను తమ ఫోన్లలో భద్రపరచుకోవడంతో పాటు అవసరమైన వారికి కూడా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుళ్లు వనిత, సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజ వర్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





హైదరాబాద్ పల్స్

# "ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు..ఆర్థికాభివృద్ధిలో భారత్ మాత్రం తగ్గేదేలే"

**ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి: ప్రధాని మోదీ.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09:** ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఘర్షణలు, వాణిజ్య ఒత్తిళ్లు, చమురు-ఇంధన సరఫరాలో అంతరాయాలు వంటి సవాళ్లు కొనసాగుతున్నప్పటికీ భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసిందని తెలిపారు.ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్-2026లో మంగళవారం ఆయన ప్రసంగించారు. సాధారణంగా ఏప్రిల్-జూన్ త్రైమాసికం ఆర్థిక కార్యకలాపాలకు సవాళ్లతో కూడుకున్నప్పటికీ భారత్ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం ఆశాజనక పరిణామమని పేర్కొన్నారు.

**అంతర్జాతీయంగా యూపీఐ విస్తరణ**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్రవేశపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మాట్లాడారు. ప్రస్తుతం యూపీఐ సేవలు 11 దేశాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర దేశాల చెల్లింపు వ్యవస్థలతో యూపీఐని అనుసంధానం చేయడం తదుపరి లక్ష్యంగా ఉండాలని ఫిన్‌టెక్ రంగానికి సూచించారు.దేశంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా డిజిటల్ చెల్లింపు సేవలు అందుబాటులోకి రావడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించిందని అన్నారు. సాంకేతికత ప్రజలను ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించడంలో ముఖ్యమైన సాధనంగా మారిందని వివరించారు.

**డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు**

ఫిన్‌టెక్ రంగం కేవలం డిజిటల్ చెల్లింపులకే పరిమితం కాకుండా రుణాలు, పొదుపులు, పింఛన్లు, బీమా వంటి రంగాల్లోనూ విస్తరించాలని ప్రధాని పేర్కొన్నారు. గత పదేళ్లలో ఫిన్‌టెక్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందడంతో కోట్లాది మంది ప్రజలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చారని తెలిపారు.



# జాతి ఐక్యత పేరుతో మైనారిటీలపై ఉక్కుపాదం?

## చైనా కొత్త చట్టంపై తీవ్ర ఆందోళనలు

**భాష, సంస్కృతి, మత స్వేచ్ఛపై ప్రభావం ఉంటుందన్న హక్కుల సంఘాల అభ్యంతరాలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, అంతర్జాతీయం, సెప్టెంబర్ 09:** చైనాలో జాతుల మధ్య ఐక్యత, అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో అమల్లోకి వచ్చిన కొత్త చట్టంపై అంతర్జాతీయంగా చర్చ మొదలైంది. 'ఎత్నిక్ యూనిటీ అండ్ ప్రోగ్రెస్ ప్రమోషన్ యాక్ట్' పేరుతో తీసుకొచ్చిన ఈ చట్టం దేశంలోని వివిధ జాతుల మధ్య సమానత్వాన్ని పెంపొందించడమే లక్ష్యమని చైనా ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ చట్టం మైనారిటీ వర్గాల భాష, సంస్కృతి, మతపరమైన ఆచారాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొన్ని హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ప్రత్యేకంగా జిన్‌జియాంగ్ ప్రాంతంలోని ఉయ్ఘర్ ముస్లింలకు సంబంధించిన అంశం మరోసారి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఉయ్ఘర్ సమాజానికి ప్రత్యేకమైన భాష, సాహిత్యం, సాంస్కృతిక సంప్రదాయాలు ఉన్నాయి. చైనీస్ భాష వినియోగాన్ని విస్తరించే విధానాలు కొనసాగితే మైనారిటీ భాషల వినియోగం తగ్గే అవకాశం ఉందని విమర్శకులు పేర్కొంటున్నారు.

**మతపరమైన కార్యకలాపాలపై ఆంక్షలపై ఆందోళన**

జిన్‌జియాంగ్‌లో మతపరమైన కార్యకలాపాలు, విద్య, ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలపై గతంలోనే ఆంక్షలు ఉన్నాయని మానవ హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, మత ఛాందసవాదాన్ని అరికట్టడమే తమ చర్యల ఉద్దేశమని చైనా ప్రభుత్వం చెబుతోంది.అయితే భద్రత, జాతీయ ఐక్యత పేరుతో తీసుకునే చర్యలు సాధారణ మత, సాంస్కృతిక కార్యకలాపాలపై కూడా ప్రభావం చూపవచ్చని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. కొత్త చట్టం అమలుతో ఈ ఆందోళనలు మరింత పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

**విదేశాల్లోని ఉయ్ఘర్ కార్యకర్తల్లోనూ ఆందోళన**

చైనాలోని పరిణామాలపై విదేశాల్లో నివసిస్తున్న ఉయ్ఘర్ కార్యకర్తలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం సవాలుగా మారుతోందని వారు పేర్కొంటున్నారు. ఒకవైపు దేశంలోని అన్ని జాతుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడమే చట్టం లక్ష్యమని చైనా ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు మైనారిటీ వర్గాల ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపుపై దీని ప్రభావం ఎలా ఉంటుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చట్టం అమలు తీరు, మైనారిటీ హక్కులపై దాని ప్రభావాన్ని అంతర్జాతీయ సమాజం పరిశీలిస్తోంది.




# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏఈకి వినతి

**ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి..**
**తక్కువ వోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని వెల్లడి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, నర్సింహులపేట, సెప్టెంబర్ 09:** నర్సింహులపేట మండల విద్యుత్ శాఖ నూతన సహాయ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన భూక్య సుమన్‌ను కౌసల్యాదేవిపల్లి గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఏఈ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.గ్రామ ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉపకేంద్రం నుంచి



కౌసల్యాదేవిపల్లికి రెండు దశల విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తక్కువ వోల్టేజీ కారణంగా గ్రామంలోని చిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ దెబ్బతింటున్నాయని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గ్రామంలోని విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.వినతిపై ఏఈ భూక్య సుమన్ సానుకూలంగా స్పందించారు. గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్త వెంకటయ్య, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మంత్రులపై బండి సంజయ్ సంచలన ఆరోపణలు

**సీఎంను కాదని ఢిల్లీకి నేరుగా డబ్బులు పంపారంటూ వ్యాఖ్యలు..**
**కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు వేస్తోందని విమర్శ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, భద్రాచలం, సెప్టెంబర్ 09** భద్రాచలంలో జరిగిన బీజేపీ ఆత్మీయ సమ్మేళనంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణ ప్రభుత్వంపై, ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులపై తీవ్ర ఆరోపణలు చేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వసూళ్లలో నిమగ్నమయ్యారని ఆరోపించారు.

**సీఎం పదవిపై కన్ను ఉందంటూ వ్యాఖ్యలు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులపై తమ పార్టీ సర్వే చేయించిందని బండి సంజయ్ తెలిపారు. వారిలో ఒకరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉంటే, మరొకరు మరో విధంగా ప్రభావం చూపుతున్నారని వ్యాఖ్యానించారు. ఇంకొక మంత్రి ముఖ్యమంత్రి పదవిపై కన్నేశారని ఆరోపించారు.గతంలో ముఖ్యమంత్రి ద్వారా ఢిల్లీకి నిధులు వెళ్లేవని, అయితే కేరళ ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ముఖ్యమంత్రిని పక్కనపెట్టి నేరుగా కేసీ వేణుగోపాల్‌కు డబ్బులు ఇచ్చారని బండి సంజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంతో ముఖ్యమంత్రి, సదరు మంత్రి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైందని వ్యాఖ్యానించారు.

**కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. భద్రాద్రి ప్రసాదం పథకానికి రూ.41 కోట్లు, ఖమ్మం-వైరా రహదారికి రూ.4,000 కోట్లు, మల్కన్‌గిరి-పాండురంగాపురం రైల్వే మార్గానికి రూ.3,600 కోట్లు, పారిశ్రామిక కారిడార్‌కు రూ.8 వేల కోట్లు కేంద్రం కేటాయించిందని తెలిపారు.రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు, ఉచిత బియ్యం, వంటగ్యాస్, రైతు సమ్మాన్ నిధి వంటి పథకాలకు కేంద్రం సహకరిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటికి కాంగ్రెస్ పేర్లు, గుర్తులు తగిలించుకుంటోందని విమర్శించారు.

**కొత్తగూడెం విమానాశ్రయంపై విమర్శలు**

కొత్తగూడెంలో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అనుకూలమైన స్థలాన్ని కేటాయించడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు ప్రభావవంతమైన మంత్రులు ఉన్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తగిన నిధులు తీసుకురాలేకపోయారని విమర్శించారు.ప్రజలకు ఎవరు నిజంగా సేవ చేస్తున్నారో, ఎవరు రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారో ప్రజలు గమనించాలని ఆయన అన్నారు.





# రాష్ట్రపతి నిలయంలో త్రివేణి విద్యార్థి ప్రతిభ

**తెలుగు కథా కథనం పోటీలో ఐదో స్థానం..**
**ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేత**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 09:** బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన తెలుగు భాషా-సాంస్కృతిక ఉత్సవాలు-2026లో లింగంపల్లి త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.తెలుగు కథా కథనం పోటీలో 7వ తరగతి విద్యార్థి వి. జయకృష్ణ దత్త విరూపాక్ష ఐదో స్థానాన్ని సాధించాడు. విజేతలకు తెలంగాణ రాష్ట్ర మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, మియాపూర్ జోన్ సీఆర్ఓ సాయి నరసింహరావు, ఏసీఆర్ఓ నరేష్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు జయకృష్ణ దత్త విరూపాక్షను అభినందించారు.

# రూ.55 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

**సిఖ్ విలేజ్ పరిధిలో అభివృద్ధి పనులు ప్రారంభం..**
**మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీగణేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, బోయినపల్లి, సెప్టెంబర్ 09:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వార్డు-6 సిఖ్ విలేజ్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీ, చందూలాల్ బౌలీ, జయనగర్ కాలనీల ప్రజలకు ఉపయోగపడేలా రూ.55 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులకు ఆయా కాలనీల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్, ఆయా కాలనీల ప్రజలు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాలేజీకి వెళ్లిన బీటెక్ విద్యార్థి అదృశ్యం!

**ఉదయం ఇంటి నుంచి వెళ్లి.. రాత్రైనా తిరిగిరాని విద్యార్థి**
**బంధువులు, స్నేహితుల వద్ద గాలింపు.. గౌరారం పోలీసులకు ఫిర్యాదు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, గౌరారం, సెప్టెంబర్ 09:** గుంటిపల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి అదృశ్యమైన ఘటనపై గౌరారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం..విద్యార్థి రోజువారీగా గౌరారంలోని విశ్వవిద్యాలయానికి వెళ్లి చదువుకుంటున్నాడు. సెప్టెంబర్ 8న ఉదయం సుమారు 7 గంటలకు కాలేజీకి వెళు _న్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీయడంతో పాటు తెలిసిన ప్రాంతాల్లో వెతికినా విద్యార్థి ఆచూకీ లభించలేదు.ఈ నేపథ్యంలో విద్యార్థి తండ్రి సెప్టెంబర్ 9న గౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విద్యార్థి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.



## రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలు సదాలక్ష్మికి ఘన సన్మానం

### ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న అధ్యాపకురాలు

### హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక సిబ్బంది, ప్రజాప్రతినిధుల అభినందనలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, సెప్టెంబర్ 09:**
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారం అందుకున్న హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు సదాలక్ష్మికి ఘన సన్మానం నిర్వహించారు. రాష్ట్రస్థాయి పురస్కారం అందుకుని కళాశాలకు తిరిగి వచ్చిన సందర్భంగా అధ్యాపక సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న సదాలక్ష్మి ఉత్తమ అధ్యాపకురాలిగా రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఇబ్రహీంపూర్ సర్పంచ్ అశోక్ పాటిల్, మహేష్, నర్సింలు, అశోక్‌తో పాటు కళాశాల అధ్యాపక సిబ్బంది, యువకులు, విద్యార్థులు సదాలక్ష్మిని అభినందించి సత్కరించారు.



## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

### ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి అభివృద్ధికి బాటలు వేయాలి

### సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి: మండల ప్రత్యేక అధికారి యాదగిరి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, సెప్టెంబర్ 09:**
గ్రామాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి యాదగిరి సూచించారు. ఆయన అధ్యక్షతన న్యాల్కల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని సూచించారు. సర్పంచులు గ్రామ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





# చర్లలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### ఉత్తమ ఉపాధ్యాయులుగా 30 మందికి సత్కారం

### సమాజ నిర్మాణంలో క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయుల పాత్ర కీలకం: ఎంఈఓ


**హైదరాబాద్ పల్స్ న్యూస్, చర్ల, సెప్టెంబర్ 09:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి పి. వెంకటరమణ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఈదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న ఎంతోమంది ప్రముఖులు ఒకప్పుడు ఉపాధ్యాయుల వద్ద విద్యను అభ్యసించిన వారేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలల్లో అంకితభావంతో సేవలందిస్తున్న సుమారు 30 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారుఎంఈఓ పి. వెంకటరమణ మాట్లాడుతూ క్రమశిక్షణ, బాధ్యత, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులే ఉన్నతమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాది వేస్తారని అన్నారు. విద్యార్థుల్లో



విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# ఏఐ అభివృద్ధిపై సంచలన హెచ్చరిక..'మనుషుల ఉనికికే ముప్పు'

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09:**
కృత్రిమ మేధ అభివృద్ధి వేగం పెరుగుతున్న నేపథ్యంలో దాని భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆంత్రోపిక్ సంస్థలో పనిచేసిన పరిశోధకుడు జాకబ్ కాక్సన్ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి. అత్యంత శక్తివంతమైన కృత్రిమ మేధ వ్యవస్థలు భవిష్యత్తులో మానవాళికి తీవ్రమైన ప్రమాదాలను కలిగించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. కృత్రిమ మేధ వ్యవస్థలు తమ సామర్థ్యాలను తామే మెరుగుపరుచుకునే స్థాయికి చేరితే వాటిపై మానవ నియంత్రణ కొనసాగించడం క్లిష్టంగా మారవచ్చని కాక్సన్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచంలోని ప్రముఖ కృత్రిమ మేధ సంస్థలు మరింత అధునాతన వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు పోటీపడుతున్న నేపథ్యంలో, అదే స్థాయిలో భద్రతా ప్రమాణాలు కూడా పెరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించినట్లు సమాచారం. తన ఆందోళనలకు సంబంధించిన కారణాలతోనే ఆంత్రోపిక్ సంస్థకు రాజీనామా చేసినట్లు కాక్సన్ సామాజిక మాధ్యమ వేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. గత మూడేళ్లలో ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేసిన అనుభవం తనకు ఉందని ఆయన వెల్లడించినట్లు సమాచారం. ఆ అనుభవం ఆధారంగానే కృత్రిమ మేధ అభివృద్ధిలో ఉన్న కొన్ని ప్రమాదాలపై తాను ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా స్వయంగా సామర్థ్యాలను పెంచుకునే అత్యంత అధునాతన కృత్రిమ మేధ వ్యవస్థల అభివృద్ధి విషయంలో మరింత జాగ్రత్త అవసరమని ఆయన అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. సాంకేతిక పోటీలో ముందుకు వెళ్లే క్రమంలో సంభావ్య ప్రమాదాలను అంచనా వేయడం, వాటిని నియంత్రించే విధానాలను రూపొందించడం కూడా అంతే ముఖ్యమని సూచించినట్లు సమాచారం. అయితే కృత్రిమ మేధ కారణంగా మానవాళి అంతరించిపోవడం ఖాయమన్నది ప్రస్తుతం నిర్ధారిత శాస్త్రీయ వాస్తవం కాదు. ఇది ఒక పరిశోధకుడు వ్యక్తం చేసిన తీవ్రమైన ప్రమాద అంచనా మాత్రమే. కృత్రిమ మేధ భవిష్యత్తుపై శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పరిశోధకుల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. కృత్రిమ మేధను సురక్షితంగా అభివృద్ధి చేసేందుకు తగిన నియంత్రణలు, పరీక్షా విధానాలు, బాధ్యతాయుతమైన అభివృద్ధి ప్రమాణాలు అవసరమనే అభిప్రాయం మాత్రం విస్తృతంగా వ్యక్తమవుతోంది. సాంకేతిక పురోగతితో పాటు దాని వల్ల ఏర్పడే ప్రమాదాలపై పరిశోధన, పర్యవేక్షణ, భద్రతా చర్యలు కూడా సమాంతరంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్న చర్చకు కాక్సన్ వ్యాఖ్యలు మరోసారి తెరలేపాయి.




# 'ఉన్మాదుల్లా ప్రవర్తించారు'.. బీఆర్ఎస్ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

### సభా గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని ఆరోపణ

### నిరసనకు ప్రజాస్వామ్య మార్గాలున్నాయి..

### వ్యక్తిగత దూషణలు మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ శాసనసభలో స్పీకర్‌ను అవమానించేలా, ఆయన తల్లిని కించపరిచేలా కొందరు సభ్యులు వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు ప్రజాస్వామ్యంలో అనేక మార్గాలు ఉన్నప్పటికీ, సభలో వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదని అన్నారు. స్పీకర్ పదవి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందని స్పష్టం చేశారు. సభలో చోటుచేసుకున్న పరిణామాలపై సభ్యులు తీవ్రంగా స్పందించారని సీఎం తెలిపారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాలని సూచించారు. రాజకీయ విమర్శలు, నిరసనలకు సభలో అవకాశం ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం శాసనసభ సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తీవ్రవాదుల తీరుతో పోలుస్తూ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో సభ్యులు సంయమనం పాటించాలని సూచించారు. దళిత నేత మల్లికార్జున ఖర్గే పాల్గొన్న కార్యక్రమం అనంతరం ఆ ప్రదేశాన్ని శుద్ధి చేసిన ఘటనను కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కులం, రాజకీయ భావజాలం ఆధారంగా ఒక ప్రజాప్రతినిధి పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం వంటి ఘటనలు సమాజానికి మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సమాన గౌరవం ఉండాలని పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాలని ప్రభుత్వం భావించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభా కార్యక్రమాలను అడ్డుకునేలా ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పైనా సీఎం తీవ్ర ఆరోపణలు చేశారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో ప్రణాళిక రూపొందించి, పార్టీ సభ్యులను ఉసిగొల్పి శాసనసభలో గందరగోళం సృష్టించేలా చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ వర్గాల స్పందనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. స్పీకర్ పదవి గౌరవం, సభా సంప్రదాయాలు, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఈ పరిణామాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి.



# ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయగలరు.. ప్రజల గొంతును కాదు!

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై ఓల్డ్ బోయిన్‌పల్లిలో ధర్నా

### ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ముద్దం నర్సింహ యాదవ్ డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఓల్డ్ బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 09:**
తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఓల్డ్ బోయిన్‌పల్లిలో బుధవారం ధర్నా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయడం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతును అణచివేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై కేటీఆర్, మాధవరం కృష్ణారావు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ శ్రేణులు అండగా ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయగలరని, కానీ ప్రజల గొంతును సస్పెండ్ చేయలేరని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయడంతో పాటు ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని ముద్దం నర్సింహ యాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి హరినాథ్, ఖదీర్, మట్టి శ్రీను, పోచయ్య, జేకే, రాజు గౌడ్, బాలరాజు, సంపత్, లింగం, ఐలేష్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, మోహన్, మహిళా అధ్యక్షురాలు లలిత గౌడ్‌తో పాటు దుర్గ, సంతోషి, స్వరూప గౌడ్, రోజా, శశికళ, దేవి, కొండమ్మ, ఉమ, సీనియర్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# కేసీఆర్‌పై వ్యాఖ్యల వివాదం..పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

**సీఎం రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్**

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, గోదావరిఖని, సెప్టెంబర్ 09:**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. సీఎం రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్యపై బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రామగుండం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ మరణాన్ని కోరుతూ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం, భౌతిక దాడులకు ప్రేరేపించేలా మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య కేసీఆర్‌పై చేసినట్లు చెబుతున్న వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కోరుకంటి చందర్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబీమా, పింఛన్లు, దళితబంధు, జిల్లాల వారీగా వైద్య కళాశాలలు, గురుకుల పాఠశాలలు వంటి పలు కార్యక్రమాలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్‌పై ఉసిగొల్పేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులకు అందించిన ఫిర్యాదుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మురళీధర్ రావు, మేకల సమ్మయ్య, తాళ్ల రాజన్న, మారుతి, అచ్చ వేణు, నూతి తిరుపతి, మేడి సదానందం, సాయి, ఈదునూరి శ్రీకాంత్, కిరణ్, ప్రవీణ్, సకినాల ప్రతాప్, పోగుల వకుళ సురేష్, రామరాజు, కనకరాజు, బుర్రి వెంకన్న, సట్టు శ్రీనివాస్, రాములు, అవునూరి వెంకటేష్, మహేష్, కుమార్ నాయక్, మొగిలి, ప్రేమ్, జనగామ శంకర్, వొల్లాల మల్లేష్, వీరాలాల్, దండ రవి, నరేష్, ప్రదీప్ గౌడ్, రణధీర్, గడ్డం పద్మ, సుజాత, రవిశంకర్, శ్రీనివాస్, కొమురయ్య, హరికృష్ణ, లక్కీ తదితరులు పాల్గొన్నారు.







# చిన్నతోకట్ట హిందూ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

**నూతన షెడ్ నిర్మాణానికి రూ.40 లక్షల విరాళం**

**ప్రజల చివరి ప్రయాణం గౌరవప్రదంగా, ప్రశాంతంగా సాగేందుకు మెరుగైన సౌకర్యాలు అవసరం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 09:**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం బోయిన్‌పల్లి చిన్నతోకట్టలోని జీఎం అంజయ్య స్మారక హిందూ శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నూతనంగా నిర్మించిన గ్రానైట్ స్టోన్ స్టేడియం లోపల కుర్చీలు, షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మేడ్చల్ - మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల చివరి ప్రయాణం గౌరవప్రదంగా, ప్రశాంతంగా సాగేందుకు శ్మశానవాటికల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన షెడ్ నిర్మాణానికి రూ. 40 లక్షల విరాళం అందించిన దాత సాదా కేశవరెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవ కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భారీగా విరాళం అందించడం అభినందనీయమన్నారు. షెడ్ నిర్మాణంతో పాటు కమాన్, ప్రహరీ గోడ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. ఈ శ్మశానవాటిక కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు వార్డులతో పాటు బేగంపేట ప్రాంత ప్రజలకు కూడా ఉపయోగపడుతున్న ముఖ్యమైన ప్రజా సౌకర్యమని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ సహకారంతో పాటు సామాజిక బాధ్యత నిధులు, దాతల సహాయం, ప్రజల భాగస్వామ్యంతో కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధిని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్మశానవాటిక కమిటీ సభ్యులు, దాతలు, స్థానిక పెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కాలుష్య నియంత్రణలో తెలంగాణ సత్తా.. దేశంలోని టాప్-10 క్లీన్ ఎయిర్ నగరాల్లో నల్లగొండ, సంగారెడ్డి

**స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో తెలంగాణ నగరాలకు గుర్తింపు**

**3 లక్షలలోపు జనాభా కేటగిరీలో సంగారెడ్డికి 8వ స్థానం.. నల్లగొండకు 10వ స్థానం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09:**
గాలి నాణ్యత, కాలుష్య నియంత్రణలో తెలంగాణ నగరాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించాయి. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో దేశంలోని అత్యుత్తమ పరిశుభ్రమైన గాలి కలిగిన నగరాల జాబితాలో తెలంగాణకు చెందిన సంగారెడ్డి, నల్లగొండ చోటు దక్కించుకున్నాయి. 3 లక్షలలోపు జనాభా ఉన్న నగరాల కేటగిరీలో సంగారెడ్డి 8వ స్థానంలో, నల్లగొండ 10వ స్థానంలో నిలిచాయి. దీంతో




వాయు కాలుష్య నియంత్రణ, పారిశుధ్య నిర్వహణలో తెలంగాణ నగరాలు చేపడుతున్న చర్యలపై ఆసక్తి నెలకొంది. ఈ కేటగిరీలో ఒడిశాకు చెందిన కళింగనగర్, అంగుల్, తాల్చేర్ వరుసగా తొలి మూడు స్థానాలను సాధించాయి. ఏలూరు, హల్దియా, విజయనగరం, దేవాస్, సంగారెడ్డి, డామ్టల్, నల్లగొండ తదితర నగరాలు టాప్-10లో నిలిచాయి.

**పెద్ద నగరాల విభాగంలో లక్నోకు అగ్రస్థానం**
10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో లక్నో 198 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. గత ఏడాది అగ్రస్థానంలో ఉన్న ఇండోర్ ఈసారి 197 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. జబల్‌పూర్ మూడో స్థానంలో నిలిచింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ప్రధానంగా పీఎం10 కాలుష్య స్థాయిల తగ్గింపు, వ్యర్థాల నిర్వహణ, రహదారుల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ చర్యలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణలోని సంగారెడ్డి, నల్లగొండ నగరాలు టాప్-10లో నిలవడం ద్వారా వాయు కాలుష్య నియంత్రణకు చేపడుతున్న చర్యలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లైంది.

# ప్రజా సమస్యలను పక్కనపెట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ వీధి నాటకాలు

**ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ, ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి.**


**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 09:**
కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రదర్శనలకు పరిమితమయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టి పెట్టకుండా పరస్పర విమర్శలు, రాజకీయ కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజకీయ విమర్శల కంటే శాసనసభలో చర్చలు, విధానపరమైన నిర్ణయాలు అవసరమని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు ఇంకా ఉన్నాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ అనేక సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు డిమాండ్**
విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని రాంచందర్‌రావు కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై శాసనసభలో సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

**22ఏ, ఉద్యోగుల సమస్యలపైనా దృష్టి పెట్టాలి**
22ఏ అంశంతో భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, వారి డిమాండ్లను కూడా ప్రభుత్వం చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ ప్రజా సమస్యలపై చర్చించేందుకు కీలక వేదిక అని రాంచందర్‌రావు అన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేసుకోవడం కంటే ప్రజలకు సంబంధించిన అంశాలను సభలో ప్రస్తావించి పరిష్కారాలు చూపాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర విమర్శలతో ప్రజలకు ప్రయోజనం ఉండదని, ప్రజా సమస్యల పరిష్కారమే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.








# కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై కేసు నమోదు చేయండి

**ఓల్డ్ బోయిన్పల్లి బి.ఆర్.ఎస్.పార్టీ నేతల ఫిర్యాదు**

**సెప్టెంబర్ 09, బోయిన్పల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
తెలంగాణ రాష్టంలోని షాద్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ కెసిఆర్ పై అనుచిత వాక్యాలపై ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్ భాయ్ మరియు డివిజన్ జనరల్ సెక్రెటరీ హరినాథ్ ఆధ్వర్యంలో బుధవారం రోజు బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై శివ శంకర్ కి లిఖిత పూర్వకంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయమని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బహిరంగంగా మీడియాతో మాట్లాడుతూ మాజీ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మరణాన్ని కోరుకున్న విధానం అత్యంత అభ్యంతరకరమైన మరియు బాధ్యతారహిత్యమైన వ్యాఖ్యలుగా పరిగణించి కేసు నమోదు చేయాలన్నారు. వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించి ఆయనపై వెంటనే ఎఫ్ఐ.ఆర్.నమోదు చేసి సమగ్ర దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు. భవిష్యత్లో ఇలాంటి బాధ్యతరాహితమైన వ్యాఖ్యలు పునారవతం కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఓల్డ్ బోయిన్పల్లి ఎస్సై శివశంకర్ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్పల్లి బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా అధ్యక్షురాలు లలిత,శశికళ,రోజా,దేవి, పోచయ్య,రాజు గౌడ్,గుడి రాజు,ఇస్మాయిల్ భాయ్ రహీం భాయ్ పాల్గొన్నారు

# రూ.20 వేల లంచంతో డీఐఈఓకు ఏసీబీ షాక్!

**రూ.50 వేలు డిమాండ్.. ఇప్పటికే రూ.30 వేలు తీసుకున్నట్లు ఆరోపణలు మిగిలిన రూ.20 వేలు స్వీకరిస్తుండగా సంగారెడ్డి కార్యాలయంలో పట్టుకున్న అధికారులు.**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 09, సంగారెడ్డి ప్రతినిధి :**
సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమావత్ గోవింద్ రామ్ రూ. 20 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 1.20 గంటల సమయంలో సంగారెడ్డిలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఏసీబీ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడికి చెందిన వికాస్ వొకేషనల్ జూనియర్ కళాశాల తాత్కాలిక అనుబంధ గుర్తింపు పొడిగింపు, పునరుద్ధరణకు సంబంధించి తనిఖీ నిర్వహించి నివేదిక సమర్పించేందుకు డీఐఈఓ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 50 వేలు లంచంగా డిమాండ్ చేయగా, ఇప్పటికే రూ. 30 వేలు స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. మిగిలిన రూ. 20 వేలను స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విధులను నిజాయితీకి విరుద్ధంగా నిర్వహిస్తూ అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. నిందితుడిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని అవినీతి నిరోధక శాఖ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది.

# పాతాళానికి పాకిస్థాన్ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి.. మరీ ఇంత దారుణమా..?

**పాకిస్థాన్‌లో పెరిగిన పేదరికం, నిరుద్యోగం**

**28.9 శాతానికి పేదరికం.. 12.69 శాతానికి నిరుద్యోగిత**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెంట్రల్ డెస్క్, సెప్టెంబర్ 09:**
పాకిస్థాన్‌లో ఆర్థిక పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారుతున్నాయి. దేశంలో పేదరికం, నిరుద్యోగిత గణనీయంగా పెరిగినట్లు తాజా ఆర్థిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్‌లో పేదరికం 28.9 శాతానికి చేరింది. గత ఏడాది ఇది 21.9 శాతంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రాంతాల వారీగా చూస్తే పంజాబ్‌లో పేదరికం 23.3 శాతానికి, సింధ్‌లో 32.6 శాతానికి, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో 35.3 శాతానికి చేరింది. బలూచిస్థాన్‌లో అత్యధికంగా 47 శాతం నమోదైంది. నిరుద్యోగిత కూడా పెరిగింది. గత ఏడాది 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు ప్రస్తుతం 12.69 శాతానికి చేరినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. నిరుద్యోగ యువత సంఖ్య 45 లక్షల నుంచి 59 లక్షలకు పెరిగినట్లు పేర్కొన్నాయి. ఉద్యోగాల కల్పన, విద్య-నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, వైద్య రంగాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక వృద్ధిని పెంచడం ద్వారా మాత్రమే పేదరికం, నిరుద్యోగాన్ని తగ్గించే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి.

